గంజాయి మత్తులో యువత?



- మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో కొనసాగుతున్న దందా
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యథేచ్ఛగా లభ్యం
- యువత, విద్యార్థులు, కార్మికులే లక్ష్యం

మేడ్చల్: నిషేధిత గంజాయి విక్రయం మేడ్చల్ నియోజకవర్గంలో రోజురోజుకూ అధికం అవుతోంది. ఎక్కడపడితే అక్కడ లభ్యం అవుతుండటంతో యువత గంజాయికి బానిసవుతోంది. మత్తులో తేలియాడుతూ చెడు మార్గంలో పయనిస్తున్నా నియంత్రించాల్సిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. ఒక్కోసారి గంజాయిని పట్టుకుంటున్నా మళ్లీ గంజాయి లభ్యత మాత్రం ఆగడం లేదు. ప్రధానంగా యువత గంజాయికి అలవాటు పడి మత్తుకు బానిసై తమ భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారు. టీనేజీ మొదలుకొని 40 ఏళ్ల లోపు వారు గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

◆ మేడ్చల్ నియోజకవర్గంలో అధికంగా ఇంజినీరింగ్ కళాశాలలు, పరిశ్రమలు ఉండటంతో యువత, కార్మికులు టార్గెట్‌గా గంజాయి మాఫియా ఆగడాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా తక్కువ ధరకే లభ్యమయ్యే సిగరెట్‌లో పొగాకు తీసేసి అందులో గంజాయి నింపి ఒక్కో సిగరెట్ రూ. 100 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా గోప్యంగా ఈ దందా సాగుతోంది. అక్రమార్కులకు ప్రధాన ఆదాయ వనరుగా గంజాయి వ్యాపారం మారింది. ఎస్ఓటీ పోలీసులు అప్పుడప్పుడు రైడ్‌లు చేస్తున్నా పూర్తి స్థాయి నిఘా లేకపోవడంతో గంజాయి దందా జోరుగా సాగుతోంది.

ఇంజినీరింగ్ కళాశాలలు, రైల్వే స్టేషన్లు, ఖాళీ వెంచర్లు అడ్డాగా...

◆ గంజాయికి అలవాటు పడ్డవారు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా వెలుస్తున్న వెంచర్లు, నిర్మానుష ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని సిగరెట్‌లలో గంజాయి పెట్టుకుని పీలుస్తూ మత్తులో ఊగుతున్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ఖాళీ రోడ్లు హాస్టల్‌లకు పక్కన ఉండే ఖాళీ స్థలాలు, కళాశాలలకు దగ్గరగా ఉండే టీ హోటళ్లు, పార్కులు, వంటి ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు కనబడుతున్నాయి.

అప్పుడప్పుడు కేసులు...

◆ మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు అప్పుడప్పుడు దాడులు చేస్తూ గ్రామాలలో పట్టుకుని వాటిని సీజ్ చేసి కేసులు పెడుతున్నారేగానీ పోలీసులతో కలిసి పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయడం లేదు. ఎక్సైజ్ పోలీసులకు తగినంత బలగం లేకపోవడం, పటిష్ట వ్యవస్థ లేకపోవడం, వారి స్టేషన్‌ల పరిధి ఎక్కువగా ఉండటంతో సంబంధిత ముఠా ఎక్కడో ఒక చోట చేలరేగుతూనే ఉంది.

పెరిగిన విద్యార్థులు.. కార్మికులు...

మేడ్చల్ నియోజకవర్గంలో అధికంగా ప్రైవేటు కళాశాలలు ఉండటం, వాటికి తగ్గట్టుగా హాస్టల్ ఉండటంతో యువత సంఖ్య ఇక్కడ ఎక్కువగా ఉంది. దాఆపు మేడ్చల్ నియోజకవర్గంలో 70 వేల వరకు ఇంజనీరింగ్ ఇతర కోర్సులు చదివే విద్యార్థులు ఉంటున్నారు. అన్ని ప్రాంతాలలో విద్యార్థులు నివాసముంటున్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని కొన్ని ముఠాలు గంజాయి మత్తులోకి దింపుతూ వారి చెంతకే గంజాయిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతం కావడం, అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో దేశంలోని అన్ని ప్రదేశాల వారు జీవనోపాధి కోసం వలసలు వచ్చి స్థానికంగా నివాసముంటున్నారు. ఉత్తరాది కార్మికులు ఎక్కువ మంది గంజాయి పీలుస్తుండటంతో వారికి సరఫరా చేయడానికి మేడ్చల్‌కు అధికంగా గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం.

ఎక్కడి నుంచి ఎలా..?

మేడ్చల్ నియోజకవర్గంలో దేశంలోని అన్ని ప్రాంతాల వారు నివాసముంటున్నారు. ఉత్తర భారతీయులకు ఇలాంటి అలవాట్లు ఎక్కువగా ఉండటంతో ఉత్తర భారతం నుంచి మేడ్చల్‌కు వచ్చే వారు చిన్న ప్యాకెట్లు, సిగరెట్ల రూపంలో రైళ్లు, ప్రైవేటు బస్సులలో ప్రయాణం చేస్తూ మేడ్చల్‌కు తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా మేల్కొని గంజాయి దందాలను అరికట్టి యువతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'ఘట్‌కేసర్ మండలాన్ని కొనసాగించాలి'

ఘట్‌కేసర్: అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం గ్రామాలను ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కలపాలని లేదంటే యథావిధిగా మండలాన్ని కొనసాగించాలని అంకుషాపూర్‌కు చెందిన పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ రాధికాగుప్తాకు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. మూడు గ్రామాలను పక్క మండలమైన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో కలుపుతారని ప్రచారం జరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఆయా గ్రామాలను పంచాయతీలుగానే ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, నాయకులు నరసింహారెడ్డి, ప్రసాద్, పవన్, బుచ్చయ్య, కాళిదాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ యజమానికి రూ. 15 లక్షల టోకరా

ఘట్‌కేసర్: నెల రోజులుగా లెక్కలు చూపకుండ వైన్స్ యజమానిని మోసం చేసిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల మేరకు... మల్లారెడ్డి అవుషాపూర్ శ్రీనిధి వైన్స్‌కు యజమాని. వైన్స్‌లో మహిపాల్‌రెడ్డి అనే వ్యక్తి పని చేస్తుంటాడు. అతడు నెల రోజులుగా వైన్స్ యజమానికి లెక్కలు చూపడం లేదు. దీంతో రూ.15 లక్షలు వరకు మోసం చేశాడని వైన్స్ యజమాని మల్లారెడ్డి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ హంసరాణి మాట్లాడుతూ... తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని వివరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ సుధారాణి, లత, ప్రవీణ, బస్తీ దవాఖాన వైద్యులు బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

కీసర: నాగారం మున్సిపాలిటీలో పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 17, 18వ వార్డులలో వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్తు తరాలకు మేలు చేసేందుకు మనమంతా ఉద్యమంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలరు హరిబాబు, బిజ్జ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి భవనాన్ని ఏర్పాటు చేయాలి



వినతి పత్రంతో మున్సిపల్ కార్యాలయం వద్ద తల్లులు

మేడ్చల్: పట్టణంలోని 13వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ వార్డుకు చెందిన పలువురు మహిళలు తమ పిల్లలతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వార్డులో అంగన్‌వాడీ కేంద్రం 12 ఏళ్లుగా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తుండగా ప్రస్తుతం ఆ హాల్‌ను కూల్చివేస్తున్నారని తెలిపారు. వార్డులో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఏర్పాటు చేయాలని కోరారు.

ఆటోలో వచ్చి రెండు హోటళ్లలో చోరీ

ఘట్‌కేసర్: చోరులు రోజురోజుకూ కొత్త దారులు వెతుకుతున్నారు. చివరికి హోటళ్లలో దోసెలు వేసే పెనాలను కూడా వదలడం లేదు. పోలీసుల సమాచారం మేరకు... పట్టణంలోని ఎన్ఎఫ్‌సీనగర్ దత్తాత్రేయనగర్‌లో టీ అడ్డా వద్ద శిరీష హోటల్‌ను నడిపిస్తుంది. బుధవారం గుర్తు తెలియని దుండగులు ఆటోలో వచ్చి శిరీష హోటల్‌లో దోశ పెనాన్ని ఎత్తుకెళ్లారు. అనంతరం ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తాలో జనార్ధన్‌గౌడ్ హోటల్‌లోలో మరో దోసె పెనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని ఉదయం గుర్తించి శిరీష, జనార్ధన్‌గౌడ్‌లు పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో వీధికుక్కల నియంత్రణకు తగు చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బ్లూక్రాస్ సభ్యులతో ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎంఓయూ, నాగారం మున్సిపాలిటీలోని అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీలో త్వరలో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నాగారంలో కుక్కల బెడద వల్ల ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ రాజేంద్రకుమార్, డిప్యూటీ ఇంజినీర్ రఘు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



శ్లోక

ఘట్‌కేసర్: దుకాణానికి వెళుతున్నానని చెప్పి ఓ మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. అంబేద్కర్ నగర్‌కు చెందిన ముత్ర శ్లోక(17) పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంటుంది. గత నెల 31 సాయంత్రం దుకాణానికి వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలిక పెద్దనాన్న గురువారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా బాలిక ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నట్లు అతడు తెలిపారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అప్లైడ్ బ్లాక్ చెయిన్ సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న కళాశాల వైస్ చైర్మన్, ఐడీఎస్ ప్రతినిధి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాల గురువారం ఐడీఎస్ (ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్) యూఎస్ఏతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో అప్లైడ్ బ్లాక్ చెయిన్ సెంటర్ ఏర్పాటుకై కుదుర్చుకున్న ఎంఓయూపై కళాశాల డైరెక్టర్ రాజిరెడ్డి, ఐడీఎస్ బిజినెస్ హెడ్ సునీల్ సుబ్రమణ్యం సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ అభివన్‌రెడ్డి మాట్లాడుతూ... బ్లాక్ చెయిన్ సెంటర్ ఏర్పాటుతో విద్యార్థులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ల్యాండ్‌స్కేప్ పరిశోధనలు, ఆవిష్కరణలను ఐడీఎస్ ప్రోత్సహిస్తుందన్నారు. భారతదేశంలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వృద్ధికి ఐడీఎస్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఐడీఎస్ బిజినెస్ హెడ్ సునీల్ సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో డీన్, హెచ్ఓడీ, టీపీఓ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి యూత్ కాన్ఫరెన్స్‌కు మేరల్ మేరబ్



మేరల్ మేరబ్

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ మహిళ ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల విద్యార్థిని ఐక్యరాజ్యసమితి యూత్ కాన్ఫరెన్స్‌కు మేరల్ మేరబ్ ఎంపికైంది. ఈ నెల 2 నుంచి 5 వరకు మలేషియాలోని కౌలాలంపూర్ నిర్వహించనున్న ఐక్యరాజ్యసమితి యూత్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి చేసిన ఎంపిక పరీక్ష, ఇంటార్వ్యూలో విజేతగా నిలిచింది. భారతదేశం నుంచి మొత్తం 10 మంది అభ్యర్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

రిటైర్డ్ ఏసీపీకి డాక్టరేట్

ఉప్పల్ : కేంద్రీయ విద్యాలయాల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ.. అసిస్టెంట్ కమిషనర్‌గా పదవీ విరమణ పొందిన రామిశెట్టి శంకర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఆయన చేసిన పరిశోధనలకు డాక్టరేట్‌ను అందుకున్నారు. కేంద్రీయ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులకు కంప్యూటర్ అవర్నెస్, కమ్యూనికేషన్ టెక్నాలజీల్లో వారికున్న అవగాహన అంశంపై ఆయన చేసిన కృషికి డాక్టరేట్ వరించింది.

గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా స్వామి



కమిషనర్ స్వామిని సన్మానిస్తున్న పాలకవర్గం, అధికారులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జూన్‌లో మున్సిపల్ కమిషనర్ రాములు ఉదోయగ విరమణ చేయడంతో కొంపల్లి కమిషనర్ శ్రీహరి ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న స్వామి బదిలీపై గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి వచ్చారు. నూతన కమిషనర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్‌గౌడ్, దుర్గాప్రసాద్, సిబ్బంది సత్కరించి స్వాగతం పలికారు.

విద్యార్థులు లేక.. పాఠశాల తెరవలేక!



మేడ్చల్: మండల పరిధిలోని బర్మాజిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక ఉపాధ్యాయురాలు మరో పాఠశాలకు వెళ్లారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి బర్మాజిగూడకు అనుబంధ గ్రామంగా ఉంది. గ్రామంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. అయితే విద్యార్థులు లేక ప్రాథమిక పాఠశాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నలుగురు చిన్నారులు పాఠశాలలో చేరగా వారిలో ముగ్గురిని తల్లితండ్రులు ప్రైవేటు పాఠశాలకు మార్చడంతో రెండో తరగతి విద్యార్థి ఒక్కడే మిగిలాడు. దీంతో స్కూల్‌లో ఉన్న టీచర్ అతడికి ఒక్కడికే పాఠాలు చెప్పేది. ఇటీవల జరిగిన బదిలీల్లో సదరు ఉపాధ్యాయురాలు మేడ్చల్‌కు బదిలీ అయ్యింది. అయితే బర్మాజిగూడకు ఎవరూ బదిలీపై వెళ్లకపోవడంతో మండల విద్యా శాఖ అధికారులు ఆమెను రిలీవ్ చేయలేదు. స్కూల్‌లో ఒక్క విద్యార్థే ఉండటంతో అతడి తల్లితండ్రులు ఆ చిన్నారిని మరో పాఠశాలలో చేర్పించడంతో టీచర్ ఉన్నా విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు ఉపాధ్యాయురాలిని ఆమె బదిలీ అయిన పాఠశాలకు పంపారు.

విద్యార్థులు వస్తే ప్రారంభిస్తాం



బర్మాజిగూడ పాఠశాలకు విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయురాలిని తాత్కాలికంగా ఆమె బదిలీ అయిన పాఠశాలకే పంపాం. బర్మాజిగూడ పాఠశాలను మూసివేయలేదు. పాఠశాలకు విద్యార్థులు తిరిగి వస్తే తిరిగి ప్రారంభిస్తాం.

– వసంతకుమారి, ఎంఈఓ

సంబరాల్లో ఎమ్మార్పీఎస్ నేతలు



ఘట్‌కేసర్‌లో సంబరాలు చేసుకుంటున్న నేతలు



మేడ్చల్‌లో సంబరాల్లో ఎమ్మార్పీస్ నాయకులు

ఘట్‌కేసర్: ఎస్సీ వర్గీకరణ అంశంపై మూడు దశాబ్దాల పోరాటానికి సుప్రీం కోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు నిర్వహించారు. బాణాసంచ కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేష్, కౌన్సిలర్ మల్లేష్, నాయకులు శివకుమార్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, జగన్, నరేందర్, ఆంజనేయులు, బాలయ్య, రాజు, సుధాకర్, నర్సింగ్‌రావు, ఎల్లేశ్, బాబురావు, రాజేశ్, యాదగిరి, సుధాకర్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీస్ నాయకులు బాణాసంచ పేల్చి మిఠాయిలు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటానికి ఫలితం లభించిదని పలువురు నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.వై.అశోక్, పరుశరాం మాదిగ, బాలనర్సింహ్మ, ప్రభాకర్, యాదయ్య, శివకుమార్, బాలకృష్ణ, రామకృష్ణ, భానుచందర్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని తొలగించి భద్రతా బాధ్యతలను ప్రైవేట్ ఏజన్సీకి అప్పగించారు. దీంతో ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సిబ్బంది వ్యతిరేకిస్తూ టౌన్‌షిప్ గేటు వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. పాత సిబ్బందిని విధుల్లో కొనసాగించాలని టౌన్‌షిప్ అసోసియేషన్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.జయచంద్ర, హరినాథ్‌రావు, వి.శ్రీనివాసులు, రమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లు కనుమరుగేనా?

- విలీన ప్రక్రియతో మారిపోతున్న మేడ్చల్ మండల పరిషత్‌లు

మేడ్చల్: హైదరాబాద్ మహానగరానికి మేడ్చల్ నియోజకవర్గ గ్రామాలు చేరువలో ఉండటం ఓవైపు వరంగా మారగా మరో వైపు శాపంగానూ మారుతోంది. నగరం ఎంతో అభివృద్ధి చెందుతున్నా మేడ్చల్ నియోజకవర్గంలో చాలా ప్రాంతాలు ఇప్పటికీ గ్రామీణ వాతావరణంలోనే ఉన్నాయి. రెండు మూడు ప్రాంతాలు మినహా అన్ని ప్రాంతాల్లో వ్యవసాయం, పాడిపంటలు అన్నీ ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం నగర విస్తరణ కోసం వినూత్న ఆలోచనలు చేస్తుండటంతో నియోజకవర్గంలో అవి కాస్తా కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తున్నది.

◆ మేడ్చల్ నియోజకవర్గంలో వాటి సంఖ్య నేటికి 61కి చేరింది. 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్‌లు రావడంతో గ్రామాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది.

◆ మేడ్చల్ మండలాన్ని విభజించి మేడ్చల్ మున్సిపాలిటీగా, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీగా మార్చారు. తాజాగా రాయిలాపూర్, పూడూర్, గ్రామాలను మేడ్చల్‌లో మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలో విలీనం చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

◆ కీసర మండలంలో గ్రామాలను విభజించి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండలంలో ఉన్న మేజర్ గ్రామాలు తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, కరీంగూడ, గోధుమకుంట, కీసర రాంపల్లి దాయర, యాద్గార్‌పల్లి, చీర్యాలలను నాగారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలలో విలీనం చేయనున్నారు.

◆ ఘట్‌కేసర్ మండలంలో మండలాన్ని విభజించి బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్‌లుగా, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాలు కాచవాని సింగారం, కొర్రెముల్, చౌదరిగూడ, ప్రతాపసింగారం, మర్పల్లిగూడ, ఎదులాబాద్, ఘనాపూర్ గ్రామాలను ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలో విలీనం చేయనున్నారు.

◆ శామీర్‌పేట్ మండలాన్ని విభజించి శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాలుగా, జవహర్‌నగర్ కార్పొరేషన్‌గా, తూంకుంట మున్సిపాలిటీగా మార్చారు. మండలంలోని శామీర్‌పేట్, బాబాగూడ, బోంరాసిపేట్, తూంకుటంలో విలీనం చేయడానికి ప్రతిపాదనలు చేశారు.

మున్సిపాలిటీలా... కార్పొరేషన్‌లా...

మేడ్చల్ నియోజకవర్గంలో పరిపాలనను పూర్తిగా మున్సిపల్ శాఖా ఆధ్వర్యంలో నడిపించడానికి సన్నాహాలు జరుగుతుండటంతో పంచాయతీ రాజ్ పాలనకు చమరగీతం పాడేలా కనిపిస్తుంది. ప్రస్తుత ఉన్న మున్సిపాలిటీలలో సమీప గ్రామాలను విలీనం చేసి మిగిలిన గ్రామాలను మేజర్ గ్రామాలను కేంద్రంగా చేసి నూతన మున్సిపాలిటీలుగా మార్చడం ఒక ఆలోచన, మరోవైపు ఔటర్ అవతలి వైపు ఉన్న మున్సిపాలిటీలను కేంద్రంగా చేస్తూ మొత్తం మండలంలో మిగిలిన గ్రామాలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడం వంటి ఆలోచనలు ప్రభుత్వం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనాయకులు బాహాటంగానే చెబుతున్నారు.

◆ మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల పాలకవర్గం పదవీ కాలం 2025 జనవరి వరకు ఉంది. తాజాగా ప్రభుత్వం హైదరాబాద్‌ను విస్తరించి విశ్వనగరంగా మార్చాలని యోచనలు చేయడంతో మున్సిపాలిటీలకు సమీపంగా ఉన్న ఔటర్ లోపలి, బయట గ్రామాలను మున్సిపాలిటీలలో విలీనం చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఉన్న పాలకవర్గం వార్డు సభ్యుడు, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవుల పదవీ కాలం ముగియడంతో ఎలాంటి న్యాయ చిక్కులు లేకుండా మొదటగా గ్రామాలను మున్సిపాలిటీలలో విలీనం చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

◆ మున్సిపాలిటీల పాలకవర్గం పదవీ కాలం వచ్చే జనవరిలో ముగియనుండటంతో ఔటర్ లోపల ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ఈ ప్రక్రియలో భాగంగా కనిపిస్తుంది.

◆ మేడ్చల్ జిల్లాలో 5 నియోజకవర్గాలు ఉండగా మేడ్చల్ మినహా 3 మిగతా 4 నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలు గ్రామాలుగా ఉండగా మిగతా అన్ని ప్రాంతాలు పట్టణాలుగా మారిపోయాయి.

◆ మేడ్చల్ నియోజకవర్గంలో ప్రస్తుతం 61 గ్రామ పంచాయతీలుండగా అందులో రెండు మూడు మినహా అన్ని గ్రామీణ వాతావరణంలోనే ఉన్నాయి.

◆ మేడ్చల్ జిల్లాగా ఉన్నా జిల్లా పరిషత్‌లో మేడ్చల్‌కు మాత్రమే ప్రాతనిధ్యం ఉంది. ఇది సమస్యగా మారింది.